క్లుప్తంగా

5న ఉర్లాంలో అష్టావధానం



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్, తదితరులు

నరసన్నపేట: జనవరి 5వ తేదీన మండలంలోని ఉర్లాంలో అష్టావధానం నిర్వహిస్తున్నట్లు అవధాన సభ నిర్వాహకులు బంకుపల్లి రమేష్ శర్మ తెలిపారు. ఈ మేరకు అష్టావదాన ఆహ్వానపత్రికను ఆదివారం ఉర్లాంలో ఆవిష్కరించారు. బంకుపల్లి రామచంద్రమూర్తి సంస్మరణార్థం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రమేష్ శర్మ మాట్లాడుతూ డాక్టర్ బులుసు అపర్ణ, 108 మంది ప్రకాస్థులు హాజరవుతారన్నారు. సుసరాపు చంద్రోశేఖర శర్మ అవధానిగా వ్యవహరిస్తాన్నారు. ఈ కార్యక్రమంలో బంకుపల్లి దివాకర్, బంకుపల్లి కృష్ణవేణి, పెంట మణిప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాల్లో హైందవ శంఖారావం ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

సారవకోట: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వీహెచ్‌పీ సభ్యులు హైందవ శంఖారావ ర్యాలీ నిర్వహించారు. వచ్చే నెల 5న విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం ర్యాలీకి మద్దతుగా తొలుత చీడిపూడి వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి అవలింగి, బుడితి, చీడిపూడి గ్రామాల్లో జైశ్రీరామ్ నినాదాలు చేసుకుంటూ ర్యాలీ చేపట్టారు. ప్రతీ ఒక్క హిందువు హైందవ శంఖారావం ర్యాలీకి హాజరుకావాలని పిలుపునిచ్చారు.

నీలమణి దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



క్యూలో ఉన్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి ఆలయానికి తెల్లవారు జామునుంచే స్థానికులతోపాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఘటాలతో మొక్కులు చెల్లించారు. భక్తులతో ఆలయ అర్చకులు కుంకుమ పూజలు చేయించారు. పలువురు భక్తులు వాహన పూజలు చేశారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న రామకౌండిన్య బృందం

ఆమదాలవలస: అంతర్జాతీయ కూచిపూడి స్వర్ణపతాక నృత్యోత్సవాల్లో పట్టణానికి చెందిన షిర్డీ సాయి నృత్య నికేతన్ గురువు రామ కౌండిన్య శిష్య బృందం నృత్య ప్రదర్శన చేసే అవకాశాన్ని దక్కించుకున్నట్లు ఆదివారం తెలిపారు. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో కృష్ణా జిల్లాలోని కూచిపూడి గ్రామంలో నృత్యోత్సవాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి గ్రామానికి చెందిన ఉప సభాపతి రఘురామ కృష్ణంరాజు, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రశంసించారు.

7 నుంచి మధ్యాహ్న భోజనం

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి జనవరి 7వ తేదీ నుంచి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఈఓ ఎ.గోవిందరావు ఆదివారం తెలిపారు. ఇప్పటివరకు పదో తరగతి వరకు మాత్రమే మధ్యాహ్న భోజన పథకం అమలవుతోందన్నారు. ఇప్పుడు జూనియర్ కాలేజ్ విద్యార్థులకు అమలు చేస్తుండడంతో వంట ఏజెన్సీలు, నిర్వాహకులు సహకరించాలని కోరామన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెట్టనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

కొడుకు ఆచూకీ కోసం తల్లి ఆవేదన

బూర్జ: మండల కేంద్రానికి చెందిన సంతోష్ కుమార్ సాహు ఏడాది కిందట గుంటూరు వెళ్లాడు. మూడు నెలల నుంచి కనీసం ఫోన్ కూడా చేయలేదని తల్లి రాధాకుమారి సాహు ఆదివారం తెలియజేశారు. కొడుకు ఆచూకీ కోసం గుంటూరు, బూర్జ పోలీస్ స్టేషన్లలో ఇటీవల ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఉన్న ఒక్క కొడుకు కనిపించకుండా పోవడంతో ఒంటరిగా మిగిలానన్నారు. కొడుకు ఆచూకీ కొనుక్కొని తన వద్దకు చేరేలా కృషి చేయాలని పోలీసులు, ప్రజాప్రతినిధులను కోరారు.

నాడు-నేడు

సంక్షేమం..



నాడు-నేడులో అభివృద్ధి చెందిన కరకవలస జెడ్పీ ఉన్నత పాఠశాల



గ్రామ సచివాలయ భవనం

వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో పాతపట్నం నియోజకవర్గంలో సాధించిన ప్రగతి ఇలా...

- ఐదు మండలాలకు వంశధార తాగునీరు అందించేందుకు రూ.265 కోట్లు ఖర్చు చేశాం.
- వంశధార నిర్వాసితులకు ఆదనపు పరిహారం కోసం రూ.216.72 కోట్లు.
- పాతపట్నం మేజర్ పంచాయతీలో 15 కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్ వైర్ల ఏర్పాటుకు రూ.93 లక్షలు.
- ఐటీడీఏ నిధులతో 14 రోడ్ల నిర్మాణానికి రూ.14.43కోట్లు
- ఆర్అండ్‌బీ రోడ్లు నిర్మాణం కోసం రూ.14.50 కోట్లు
- పీఐయూ 11 రోడ్ల నిర్మాణం కోసం రూ.27.20 కోట్లు
- నాడు-నేడులో 246 పాఠశాలల అభివద్ధి కోసం రూ.46.38 కోట్లు
- 91 గ్రామ సచివాలయ భవన నిర్మాణాల కోసం రూ.36.40 కోట్లు
- 91 రైతు భరోసా కేంద్రాల నిర్మాణం కోసం రూ.18.20 కోట్లు.
- 91 వెల్‌నెస్ కేంద్రాల నిర్మాణం కోసం రూ.15.47 కోట్లు.
- రూ.6.95 కోట్లు ఖర్చుతో మహేంద్రతనయ నదిపై కొరసావడ, కాగువాడ, రొమదల వద్ద వంతెన నిర్మాణం చేపట్టాం.

- ఆరు నెలలుగా అభివృద్ధి లేదాయే
- ప్రజలకు దూరంగా సచివాలయ సేవలు
- పెరిగిన కరెంటు బిల్లులు, నిత్యావసరాల ధరలు
- కరోనా వంటి కష్టకాలంలోనూ ఆదుకున్న జగనన్న



మహేంద్రతనయ నదిపై కాగువాడ వద్ద వంతెన నిర్మాణం

రివైండ్ 2024

ఎల్.ఎన్.పేట: గత వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో సకాలంలో అనేక సంక్షేమ పథకాలు అమలు అయ్యాయి. అభివృద్ధి పరుగులు తీసింది. ఒకవైపు ప్రజల వద్దకు ప్రభుత్వ పరిపాలన తీసుకు వస్తూనే.. మరోవైపు ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కింది. 2019 నుంచి 2024 వరకు అనేక సంక్షేమ పథకాలను పొందిన లబ్ధిదారులకు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నాలుగు నెలలు, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఆరు నెలలుగా ఎలాంటి పథకాలు అందలేదు. కరోనా వంటి కష్ట కాలంలోనూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకు దక్కింది. 2024 ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాల అమలుకు సంక్షోభం ఏర్పడింది.

సంక్షోభం

నిలిచిపోయిన సంక్షేమ పథకాలు

జగనన్న ఇచ్చిన రైతు భరోసా, వైఎస్సార్ నేతన్న నేస్తం, సున్నా వడ్డీ, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన, ఉచిత పంటల బీమా, జగనన్న చేదోడు, జగనన్న కానుక (8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ), పేదలకు ఇళ్ల స్థలాలు, కాలనీ ఇళ్లు, వైఎస్సార్ వాహన మిత్ర.. వంటి అనేక సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు నేడు అందకుండా పోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని ప్రజలను నమ్మించిన చంద్రబాబు పథకాల అమలు ప్రస్తావనే తీసుకురావటం లేదని పలువురు ఆందోళన చెందుతున్నారు.

సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చాం..



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కక్ష సాధింపు చర్యలకు ప్రాధాన్యం ఇస్తోంది. గంజాయి, ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణా, రెడ్ బుక్ పరిపాలన కొనసాగుతోంది. సూపర్ సిక్స్ హామీలు అని చెప్పి ప్రజలను నమ్మించి ఆరు నెలలు అవుతున్నా సంక్షేమ పథకాలు అమలు చేయటం లేదు. ఉచిత గ్యాస్ కొందరికే అందింది. రాష్ట్రంలో నయవంచన పాలన కొనసాగుతోంది.

– రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే, పాతపట్నం

సమ్మెలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు



విజయవాడలో సమ్మె చేస్తున్న ఉపాధ్యాయులు

- విద్యార్థులకు బోధన అంతంత మాత్రమే

మెళియాపుట్టి: మండలంలోని పెద్దమడి గిరిజన సంక్షేమ పాఠశాలలో ఒప్పంద పద్ధతిలో పని చేస్తున్న 10 మంది ఉపాధ్యాయులు సుమారు 40 రోజులుగా సమ్మెలో ఉన్నారు. పాఠశాల వద్ద వారం రోజుల క్రితం విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. ఇటువంటి సమయంలో సరైన బోధన అందడంలేదని వాపోయారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు సమ్మె విరమణ చేయలేదని, డిప్యుటేషన్ ఉపాధ్యాయులతో బోధన నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యాబోధన సక్రమంగా అందించకపోతే 10వ తరగతి పరీక్షలు దగ్గరికి వస్తున్న తరుణంలో ఇలా అయితే మా పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకమేనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం పలువురు ఒప్పంద ఉపాధ్యాయులతో సాక్షి మాట్లాడగా.. పీఆర్‌సీ 2010నే ఇప్పటికే అమలు చేస్తూ తమ శ్రమ దోపిడీ చేస్తున్నారని, 2022 పీఆర్‌సీ అమలుచేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల మంది ఉపాధ్యాయులు గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పని చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నారు. ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలు అమలుకు ముందుకు రాలేదని తెలిపారు.

వావిలపల్లికి ఘన సత్కారం



పొందూరు: వావిలపల్లి రాజారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

పొందూరు: విజయవాడ కేబీఎన్ కళాశాల ఆవరణలో నిర్వహించిన ప్రపంచ ఆరో తెలుగు రచయిత మహాసభల్లో పొందూరుకు చెందిన శ్రీశ్రీ కళా వేదిక జిల్లా విభాగం ప్రధాన కార్యదర్శి వావిలపల్లి రాజారావు మాస్టార్‌ను ఆదివారం సత్కరించారు. సినీ గేయ రచయిత భువన చంద్ర, లెనిన్ శ్రీనివాస్ తదితరులు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. మాస్టార్ స్వీయ కవితాగానం చేశారు.

యువ కవులకు కుప్పిలి శిక్షణ..

ఆమదాలవలస: ప్రపంచ తెలుగు మహాసభలలో యువ కవులకు ఆదివారం ఆమదాలవలసకు చెందిన కవి, రచయిత కుప్పిలి వెంకట రాజారావు శిక్షణ ఇచ్చారు. విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో యువ కవులకు వచన కవిత్వం ఎలా రాయాలన్న అంశంపై శిక్షణ ఇచ్చి, యువ కవులతో కవితలు రాయించారు. రాజారావును నిర్వాహకులు సన్మానించారు.

పరామర్శ..



తమ్మినేని సీతారాంతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తనయుడు చిరంజీవినాగ్ ఇటీవల హైదరాబాద్‌లో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. రెండు రోజుల క్రితం ఆమదాలవలసలో తన నివాసానికి వచ్చారు. ఆదివారం చిరంజీవినాగ్‌ను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పరామర్శించారు. అనంతరం తమ్మినేనితో పలు రాజకీయ అంశాలు చర్చించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు చిట్టిబాబు మృతి





చిట్టిబాబు కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న ధర్మాన కృష్ణదాస్ (ఇన్‌సెట్లో) మృతుడు చిట్టిబాబు (ఫైల్)

నరసన్నపేట: మండలంలోని ముద్దాడపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముద్దాడ చిట్టిబాబు(53) గుండెపోటుతో మృతి చెందారు. శనివారం రాత్రి అనారోగ్యంగా ఉందని భార్యతో చెప్పిన కొద్ది సమయానికే గుండె పోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు. పారశెల్లి ఎంపీటీసీగా 2014–2019 మధ్య పనిచేశారు. చిట్టిబాబుకు భార్య సూరమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మంచి మిత్రుడుని కోల్పోయాను..

చిట్టిబాబు తనకు మంచి మిత్రుడని, క్రమశిక్షణ కలిగిన నాయకుడిని కోల్పోయామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. చిట్టిబాబు భౌతికఖాయానికి ఆదివారం ఉదయం నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ రాజకీయంగా మొదటి నుంచి తమ కుటుంబం వెంటే చిట్టిబాబు ఉన్నారన్నారు. ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం చిట్టిబాబు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సర్పంచ్ బగ్గు రమణమ్మ, ఎంపీటీసీ సభ్యుడు పంగ శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బగ్గు సతీష్ సంతాపం వ్యక్తం చేశారు.

17 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

పాతపట్నం: మండలంలోని 17 రైతు సేవా కేంద్రాల పరిధిలో 36 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా.. 17,180 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఏఓ బి.రవికుమార్ ఆదివారం తెలిపారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించడం జరిగిందన్నారు. ధాన్యం తీసుకున్న 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు తెంబూరు సంత పునఃప్రారంభం

పాతపట్నం: మండలంలోని తెంబూరు గ్రామంలో సోమవారం సంతను పునఃప్రారంభం చేయనున్నట్లు సర్పంచ్ బెనియా వెంకటరమణ ఆదివారం తెలిపారు. కరోనా సమయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మండల అధికారులు సంతను నిలిపివేశారన్నారు. ఇటీవల కలెక్టర్, జేసీ, తహసీల్దార్, ఎంపీడీఓలకు వినతిపత్రాలను అందజేశామని సర్పంచ్ తెలిపారు. అధికారుల అనుమతితో సంతను పునఃప్రారంభం చేస్తున్నామన్నారు. గతంలో తెంబూరు సంత ఎండు చేపలకు ప్రసిద్ధి చెందినట్లు పరిసర ప్రాంతాల ప్రజలు చెప్పుకునేవారన్నారు. తెంబూరు పరిసర గ్రామాల ప్రజలు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొండను తవ్వేస్తున్నారు



కొండపై ఇటీవల వేసిన మార్గం



కొండపై అక్రమంగా జేసీబీతో తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

సారవకోట: మండలంలోని నౌతళ ఘాట్ రోడ్డు పక్కనే ఉన్న కొండపై అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. నౌతళ, ధనుపురం, దాసుపురం, ధర్మలక్ష్మీపురం గ్రామాలకు చెందిన కొంతమంది జేసీబీ యజమానులు ఇక్కడ గ్రావెల్ తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. సమీపంలో ఉన్న గ్రామాల్లోని పంట పొలాలను ప్లాట్లుగా మార్చేందుకు, గృహ నిర్మాణాలు చేపట్టే సమయంలో పునాదుల్లో వేసేందుకు ఈ గ్రావెల్ వేయడానికి జేసీబీ యజమానులు ఒప్పందం కుదుర్చుకుని గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ఇదివరకు ఈ కొండను ధనుపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి లీజు ఉండేది. సమయానికి లీజు చెల్లించకపోవడంతో ఆ లీజును గత కొన్నేళ్ల క్రితం రద్దు చేశారు. అప్పటినుంచి ఇక్కడ గ్రావెల్, స్టోన్ క్రషర్‌కు వినియోగించే రాళ్లు అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపై గతంలో మైన్స్ అధికారులు తనిఖీలు చేపట్టి అపరాధ రుసుం సైతం విధించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న వైద్యుడు ప్రదీప్ కుమార్ స్వైన్, మధుబాబు

పాతపట్నం: స్థానిక మహేంద్ర జూనియర్ కళాశాలలో ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. నియోజకవర్గంలోని 36 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులు 638 మంది పరీక్షల్లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. ప్రథమ స్థానంలో అమరజ్యోతి పాఠశాలకు చెందిన కళ్ల తనూశ్రీకి రూ.3 వేలు, ద్వితీయ స్థానంలో రొంపివలస హైస్కూల్‌కు చెందిన పి.ధనుష్‌కు రూ.2 వేలు, తృతీయ స్థానంలో విజ్ఞాన్ స్కూల్ విద్యార్థి కొమరాపు మోహన్‌కు రూ.1,500 నగదు, షీల్డ్, సర్టిఫికెట్లను పార్లాకిమిడి కంటి వైద్యనిపుణుడు ప్రదీప్ కుమార్ స్వైన్ అందజేశారు. కళాశాల డైరెక్టర్ ఎస్.మధుబాబు, ప్రిన్సిపాల్ ఎం.ఆంజనేయులు, ఏఆర్జీ ఆచార్యులు, బి.వి.రమణ, రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వామినాయుడు సత్తా



ఈ నెల 26 డిసెంబర్ 29 వరకు విజయవాడలో జరిగిన 35వ జాతీయ సౌత్ జోన్ 50 మీటర్ల బటర్ ఫ్లై విభాగం క్రీడలో బూర్జ మండలంలోని డొంకలపర్త గ్రామానికి చెందిన బలగ స్వామినాయుడు ప్రతిభ కనబర్చి 3వ స్థానంలో నిలిచాడు. బ్రాంజ్ మెడల్ (కాంస్య పతకం) కైవసం చేసుకున్నాడు. స్వామినాయుడుకి గ్రామ పెద్దలు, యువత అభినందించారు.

- బూర్జ

నిరుపయోగం..



హిరమండలం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద రూ.లక్షలు ఖర్చు చేసి జనరేటర్లు ఏర్పాటు చేశారు. వీటిని ఒక్కరోజు కూడా నియోగించిన దాఖలాలు లేవు. ఎండకు ఎండి వానకు తడచి తుప్పుపడుతున్నాయి. రూ.లక్షల్లో ప్రజాధనం వృథా అవుతుంది. ఇప్పటికైనా వాటిని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

- హిరమండలం

శిథిలావస్థ..



పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఉన్న అటవీశాఖ బీట్ అధికారి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గత 15 ఏళ్లగా ఈ భవనం వినియోగంలో లేదు. ఈ స్థలంలో బీట్ అధికారి గృహం నిర్మాణం చేపట్టాలని, లేకపోతే ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ఉపయోగించుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్థలాలను రక్షించాలని విన్నవిస్తున్నారు.

- పాతపట్నం

పైప్‌లైన్‌ను బాగుచేశారు..



పైపులైన్‌ను బాగు చేయించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

కొత్తూరు: మండలంలోని మహార్తాపురం కాలనీ వద్ద మెగా వాటర్ స్కీమ్ పైప్‌లైన్ నుంచి నీరు లీక్ అయింది. తాగునీరు వృథా అనే శీర్షికతో ఈ నెల 23న సాక్షిలో ప్రచురించిన వార్తకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆదివారం స్పందించారు. లీక్ అవుతున్న పైపులైన్‌ను బాగుచేశారు. తాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకున్నారు.

ప్రమాదకర మలుపు



జోగిపాడు కాలనీ వద్ద ఉన్న మలుపు

కొత్తూరు: మండలంలోని వసప నుంచి మెట్టూరు వరకు ఉన్న రోడ్డులో జోగిపాడు కాలనీ వద్ద ఉన్న మలుపు ప్రమాదకరంగా మారింది. ఈ మలుపు వద్ద రోడ్డు బెర్మను కొంతమంది ఆక్రమించి కంచె ఏర్పాటు చేశారు. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్‌ను ఏర్పాటుచేయాలని, కంచెను తొలగించాలని స్థానికులు కోరారు.